జాబ్‌మేళాకు విశేష స్పందన

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి - అమలాపురం

ఆకొండి సింహాచలం సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది. వివిధ కంపెనీల ప్రతినిధులు అర్హులైన వారికి నియామక పత్రాలు అందించారు. సుమారు 28 మందికి నియామ పత్రాలు అందజేశారు. మరింత మందికి సంబంధించిన నియామక పత్రాలు తుది పరిశీలనలో ఉన్నాయని మరొక వారం రోజుల్లో వారి వివరాలు తెలియపరుస్తామని కంపెనీల ప్రతినిధులు తెలిపినట్టుగా ట్రస్ట్ ఛైర్మన్ ఆకొండి పవన్ తెలియజేశారు. కార్యక్రమంలో ఆకొండి సింహాచలం ట్రస్ట్ ప్రతినిధులు రవీంద్ర, అకొండి చాణిక్య, జెసిఐ ప్రతినిధులు వాణి, వాడ్రేవు శ్రీరామ్ ఈ కార్యక్రమ నిర్వహణకు వేదికని ఇచ్చి సహకరించిన ఎఎస్ఎన్ కాలేజ్ యాజమాన్యం వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వాటర్ గ్రిడ్ పట్టాలెక్కేనా..?

- రూ.1,650 కోట్లతో నిర్మాణానికి యోచన
- రెండేళ్లు దాటినా ముందుకు కదలని పనులు
- స్వచ్ఛ నీటి కోసం ప్రజల ఎదురు చూపులు

అఖండ గోదావరి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టా పరిధిలో ఉన్న 36 మండలాల్లో ఉన్న 1600 గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛ తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం 'వాటర్ గ్రిడ్' పథకాన్ని తీసుకొచ్చింది. గత ప్రభుత్వ హయాంలో ఈ పథకాన్ని రూపొందించారు. కానీ వైసిపి సర్కారు ఒక రూపాయి కూడా కేటాయించలేదు. ఐదేళ్ల గడిచిపోయి అధికారం కోల్పోయింది. దీంతో ఈ పథకం మూలకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటర్ గ్రిడ్ పథకాన్ని తప్పకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. 9 నెలలు గడుస్తున్నప్పటికీ ఈ పథకంపై కూటమి ప్రభుత్వంలోనూ ఒక్క అడుగు ముందుకు పడడం లేదు. దీంతో శుద్ధ జలం కోసం ఎదురుచూస్తున్న సాధారణ ప్రజానీకానికి నిరీక్షణ తప్పడం లేదు. ఈ పథకం ఎప్పటికీ అమలవుతుంది? ఎప్పుడు పనులు ప్రారంభమవుతాయి..? ఎప్పటికీ పూర్తవుతాది? అనే ప్రశ్నలు ప్రజల నుంచి వస్తున్నాయి.

ఇదీ ప్రణాళిక

గోదావరి నీటిని శుద్ధిచేసి పైపులైను ద్వారా మళ్లించి ఇంటింటికి కుళాయి ద్వారా రోజుకి ఒక మనిషికి 55 లీటర్ల శుద్ధమైన తాగునీటిని అందించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీసుకొచ్చారు. 2054 సంవత్సరం వరకు గృహ, వ్యవసాయ, పారిశ్రామిక అవసరాల కోసం ప్రణాళికను సిద్ధం చేశారు. ధవళేశ్వరం బ్యారేజి ద్వారా 2.153 టిఎంసిల గోదావరి నీటిని ఫిల్టర్ చేసి తూర్పు డెల్టాలోని 511 ఆవాస ప్రాంతాల పరిధిలోని 10.31 లక్షల మందికి, మధ్య డెల్టాలో 1100 ఆవాస ప్రాంతాల్లో 10.49 లక్షల మందికి నీరు అందివ్వాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఆత్రేయపురం మండలం వెలిచేరు, కడియం మండలం జేగురుపాడులలో ఫిల్టర్ ప్లాంట్లను నిర్మిస్తారు. బొబ్బర్లంక, ధవళేశ్వరంలలో ఇంటెక్ వెల్స్‌ను ఏర్పాటు చేస్తారు. గోదావరి నీటిని ఇంటెక్ వెల్స్ ద్వారా పంపింగ్ చేసి ఫిల్టర్ ప్లాంట్ లకు పంపుతారు. అక్కడ ఫిల్టర్ అయినా తాగునీటిని పైపులైను ద్వారా నిర్దేశించిన ప్రాంతాలకు కుళాయిల ద్వారా స్వచ్ఛ నీటిని సరఫరా చేసేందుకు ప్రణాళికను రూపొందించారు.

కేంద్రం 50, రాష్ట్రం 50 శాతం నిధులు

కేంద్రం 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం మరో 50 శాతం నిధులను ఈ ప్రాజెక్టుకు కేటాయించాల్సి ఉంది. మొత్తంగా రూ.1650 కోట్ల నిధులతో దీనిని నిర్మించాలని భావించారు. గత ప్రభుత్వం హయాంలో కేంద్రాన్ని వైసిపి సర్కారు నిధులను అడగలేక పోయింది. దీనికితోడు రాష్ట్ర ప్రభుత్వం కూడా నిధులు కేటాయించేందుకు కనీస ప్రయత్నం చేయలేదు. దీంతో ఈ పనులు ప్రారంభం కాని పరిస్థితి నెలకొంది. దీంతో నేటికీ ఈ పథకం పట్టాలెక్కలేదు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు ఈ ప్రాజెక్టు నిధుల కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది. గత ప్రభుత్వ హయాంలోనే పనుల నిర్వహణకు టెండర్లు ప్రక్రియ పూర్తయ్యాయి. 2025 జూన్ 25 నాటికి పనులు పూర్తి కావాలని కాంట్రాక్టు సంస్థతో ఒప్పందం జరిగి రెండేళ్లు పైనే పూర్తయింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో ప్రాజెక్ట్ పనులపై నీలినీడలు అలుముకున్నాయి.

సురక్షిత నీటి కోసం అల్లాడుతున్న జనం

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు ప్రాంతాల ప్రజలు నేటికీ తాగునీటి సమస్యను తీవ్రస్థాయిలో ఎదుర్కొంటున్నారు. గోదావరి పక్కనే ఉన్నా సురక్షిత తాగునీరు సక్రమంగా అందని పరిస్థితులు ఉన్నాయి. నేటికీ పలు ప్రాంతాల ప్రజలకు కలుషిత నీరే దిక్కవుతుంది. దీంతో అనేకమంది రోగాల భారిన పడుతున్నారు. ప్రభుత్వాలు తాగునీటి అవసరాల కోసం పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉంటున్నాయి. దీంతో అనేకమంది గ్రామీణ ప్రాంత ప్రజలు సురక్షిత తాగునీటి కోసం అనేకేళ్లుగా ఎదురు చూస్తున్నారు. ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుంది? ఎప్పుడు స్వచ్ఛ తాగునీరు అందుతుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

వేధిస్తున్న భూ సేకరణ

భూ సేకరణ సమస్య వేధిస్తోంది. మరోవైపు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధుల విడుదలలో తీవ్ర జాప్యం చేస్తుండడంతో ప్రాజెక్ట్ ఎప్పుడు ప్రారంభమవుతుందనేది నేటికీ స్పష్టత లేకుండా పోయింది. ఇప్పటికే అధికారులు సుమారు 650 కిలోమీటర్లు సర్వే పూర్తి చేశారు. జేగురుపాడులో 11 ఎకరాలు భూసేకరణ పూర్తి చేశారు. అయితే ప్రభుత్వం దీనికి బడ్జెట్ ను విడుదల చేయలేదు. వెలిచేరు గ్రామం వద్ద 10 ఎకరాల భూసేకరణ చేయాల్సి ఉంది. ఇవన్నీ జరగాలంటే తొలుత ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. అప్పుడే ప్రాజెక్టు పట్టాలెక్కే అవకాశం ఉంటుంది.

త్వరలో పనులు ప్రారంభమయ్యే అవకాశం

వాటర్ గ్రిడ్ పథకం పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉంది. టెండర్లు త్వరలోనే పూర్తవుతాయి. ప్రస్తుతం ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం సర్వే జరుగుతుంది. కూటమి ప్రభుత్వం నిధులను కేటాయిస్తే పనులు త్వరగా మొదలు పెట్టి పూర్తి చేస్తాము.

- ఎన్. భారతి, ఇన్‌ఛార్జ్ ఎస్ఇ, ఆర్ డబ్ల్యుఎస్

సర్పంచ్ లావణ్య తదితరులను సత్కరిస్తున్న ఎంపిడిఒ రాజు తదితరులు

ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఆలమూరు

ప్రజాశక్తి - ఆలమూరు

జాతీయస్థాయి ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ పోటీలకు ఆలమూరు గ్రామ పంచాయతీ ఎంపికయింది. దేశవ్యాప్తంగా ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామ పంచాయతీ పోటీలకు 770 గ్రామపంచాయతీలు ఎంపిక చేశారు. వీటిలో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా నుంచి గ్రామ పంచాయతీ ఆలమూరు ఎంపిక కావడంపై అందరూ హర్షం వ్యక్తంచేశారు. ఆలమూరు గ్రామ పంచాయతీని గ్రామ కార్యదర్శి కె.మోక్ష అంజలి గ్రామ సచివాలయ ఉద్యోగుల సహకారంతో 2025 - 26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అన్ని రంగాల్లోనూ అగ్రగామిగా, అత్యుత్తమ పంచాయతీగా అభివృద్ధి చేసి జాతీయ అవార్డును కైవసం చేసుకుంటామని సర్పంచ్ నేలపూడి లావణ్య కుమార్ రాజా ధీమా వ్యక్తం చేశారు. శానిటరీ, డ్రెయినేపజీ, రహదారుల అభివృద్ధిలో గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న విషయాన్ని ఆమె గుర్తు చేశారు. ఉమెన్ ఫ్రెండ్లీ పోటీలకు ఎంపికైన సందర్భంగా ఎంపిడిఒ ఐ.రాజు నేతృత్వంలో మండల కేంద్రంలో ఆదివారం సర్పంచ్ లావణ్య, కార్యదర్శి మోక్ష అంజలి, బిల్ కలెక్టర్ కె.రమణలను ఘనంగా సత్కరించారు.

సాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి

తాటిపాక నీటి సంఘం సమావేశం

ప్రజాశక్తి -మామిడికుదురు

సాగు నీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తాటిపాక నీటి సంఘం అధ్యక్షులు కడలి కృష్ణమోహన్ అన్నారు. కొమరాడలో కృష్ణమోహన్ అధ్యక్షతన ఆదివారం తాటిపాక నీటి వినియోగ దారుల డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నుకునందుకు రాజోలు ఎంఎల్ఎ దేవా వరప్రసాద్‌కు ఛానెల్ పరిధిలో రైతులకు, కూటమి నాయకులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ రబీ పంట చివరి దశకు చేరుకోవడంతో నీటి ఎద్దడి రాకుండా ప్రతీ డైరెక్టర్ వారి పరిధిలో రైతులతో మమేకమై నీరు అందేలా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఇకను ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికు తీసుకురావాలని ఆ సమస్యలు అధికారులతో చర్చించి పరిష్కారం అయ్యేలా చర్య తీసుకుందామని డైరెక్టర్లకు అధ్యక్షులు సూచించారు. ఈ పంట పూర్తి అయిన తరువాత వేసవి కాలంలో కాలవల పూడిక తీయుట, అవసరమైన చోట్ల రిటర్నింగ్ వాల్స్, వంతెనలు నిర్మించేందుకు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, కోనసీమ సెంట్రల్ డెల్టా ప్రాజెక్ట్ ఛైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అధికారులతో చర్చించి కృషి చేస్తామన్నారు ఈ సమావేశం లో డైరెక్టర్లు అప్పారి వెంకటేశ్వరావు, నేదూరి శ్రీనివాసరావు, చెగొండి పద్మావతి, జక్కంపూడి సూర్యప్రకాష్ రావు, పులఖండం సీత, ఆకుల మల్లేశ్వరరావు, విత్తనాల త్రిమూర్తులు, అనసూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఏటిగట్టు రహదారి

గోతులమయంగా కపిలేశ్వరపురం ఏటిగట్టు రహదారి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండల కేంద్రం కపిలేశ్వరపురం నుంచి జొన్నాడ వెళ్లాలంటే ఏటిగట్టు రహదారి గోతులతో ప్రమాదకరంగా మారింది. ఈ ఏటిగట్టు రహదారి పై ప్రయాణం చేయాలంటే వాహనదారులు ప్రాణాలు అరచేతితో పెట్టుకోవలసిన పరిస్థితి .ప్రతీ రోజు రద్దీగా ఉండే ఈ రహదారి మీదుగా వెళ్లాలంటే ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని ప్రయాణికులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు అందులోనూ ఏటిగట్టు రహదారి కావడం వల్ల ఆదమరిస్తే ఒక పక్క గోదావరి, ఇటు కాలవ, అటు గోతులు ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏటిగట్టు రహదారిలో పెద్ద గోతులు ఏర్పడడంతో వాహనదారులు రోడ్డు దాటితే చాలు అనే పరిస్థితి నెలకొంది. రావులపాలెం, జొన్నాడ, యానం, కోటిపల్లి తదితర గ్రామాలకు వెళ్లాలంటే ప్రతి నిత్యం ఈ రహదారి మీదు గా ప్రయాణాలు సాగిస్తూ ఉంటారు. ఎంతో రద్దీగా ఉంటున్న రహదారిపై ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకముందే సంబంధిత అధికారులు గుంతలు ఏర్పడిన ప్రదేశాల్లో తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహన దారులు ప్రయాణికులు ప్రజలు కోరుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి

- 17 నుంచి ప్రారంభం కానున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలు
- పలువురు నిపుణుల సూచనలు

పెదపట్నంలంక హైస్కూల్లో పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

ప్రజాశక్తి- మామిడికుదురు

పదవ తరగతి పరీక్షలకు సమయం సమీపిస్తుంది మనోధైర్యంతో ముందుకు సాగేలా వేళ కు ఆహారము నిద్ర ఉండేలా తల్లిదండ్రులు చూసుకుంటున్నారు. సందేహాలు వస్తే సమాధానం చెప్పేందుకు మేము సిద్ధమంటూ ఉపాధ్యాయులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటున్నారు తొలిసారి రాసే పబ్లిక్...పరీక్ష లకు తడబడకుండా, పొరపాట్లకు ఆస్కారం లేకుండా సాగాలన్నది అందరి ఆకాంక్ష.

విద్యార్థులలో టెన్షన్ మొదలయింది మరో వారం రోజుల్లో పరీక్షలు ప్రారంభం కానున్నాయి పబ్లిక్ పరీక్షలు అనగానే తెలియని ఆందోళన ఈ నెల 17 నుంచి 31 వరకు పది పరీక్షలు కు అన్ని ఏర్పాట్లు చేశారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా లో పదవ తరగతి పరీక్షలకు 110 కేంద్రాల నుంచి 19,217 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు ఈ నేపథ్యంలో సాధారణంగా చేసే చిన్న చిన్న పొరపాట్లు, వాటిని సరిదిద్దుకోవలసిన తీరు, పరీక్షలు రాయడంలో మెళకువలను పలువురు నిపుణులు తెలియజేశారు.

చేతిరాతే కీలకము

ఆణి ముత్యాల లాంటి అక్షరం కోసము విద్యార్థులు ప్రాథమిక సూత్రాలను పాటించాలని పెద పట్నం లంక హైస్కూల్ హెచ్ఎం కె.హరనాథ్ అన్నారు. సమాధాన పత్రము రాసేటప్పుడు కూర్చునే భంగిమ, కలాన్ని పట్టుకునే విధానం, కాగితానికి కలానికి మధ్య దూరము వంటి అంశాలు కీలక పాత్ర వహిస్తాయి సమాధాన పత్రంలో జవాబు సూటిగా, అక్షరాలు పొందికగా ఉంటే, మూల్యాంకనం చేసే ఉపాధ్యాయులు అదనంగా మార్కులు వేసే అవకాశం ఉందన్నారు. అక్షరాలు పదాలు, వాక్యాల మధ్య తగిన ఖాళీలు ఉండేలా చూడాలన్నారు. చాలామంది కష్టపడి చదువుతారు. కానీ బాగా రాయకపోవడంతో అనుకున్న మార్కులు సాధించ లేకపోతున్నారని అన్నారు. సమాధానాలు రాసేట ప్పు డు అక్షరాలు, పదాలు, వాఖ్యాల మధ్య తగిన ఖాళీలు ఉండేలా చూడాలి ఆంగ్ల, తెలుగు భాషల్లో మెరుగైన రాత కోసం అపసవ్య దిశలో రాయడం రావాలన్నారు.

ఆహ్లాదకర వాతావరణం ఉండాలి

ఏకధాటిగా కాకుండా విశ్రాంతి తీసుకుంటూ, చదువుకోవటం వల్ల మంచి ఫలితాలు సాధించే అవకాశం ఉందని మామిడికుదురు ఎంఇఒ ఎం.వెంకన్నబాబు అన్నారు. మానసిక ఒత్తిడికి గురి కాకుండా, విద్యార్థులు చదువుకోవాలి చదవడానికి, విశ్రాంతి తీసుకోవడానికి సరైన ప్రణాళిక చేసుకోవాలన్నారు. దీని ప్రకారము వ్యవహరిస్తే ఎందులోనూ ఒత్తిడి దరి చేరదు రాత్రి సమయాల్లో ఎక్కువసేపు చదవడం వల్ల అలసట పెరిగి నిస్సత్తువ ఆవహించే పరిస్థితి ఉంటుందని అన్నారు.

తేలికగా జీర్ణ మయ్యే ఆహారం తీసుకోవాలి

విద్యార్థులు ఆహారం విషయంలో జాగ్రత్తలు తీసు కోవాలని, తేలికగా జీర్ణమయ్యే ఆహారాని భుజిం చాల ని నగరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కెజె.ప్రశాంత్ అన్నారు. కాసి వడ కట్టిన నీరు తాగాలన్నారు. పండ్లు, కూరగాయలు, కొబ్బరి నీళ్లు వంటి పదార్థాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉదయం టీ, కాపీల కంటే రాగిజావ తీసుకోవాలన్నారు.

960 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - మామిడికుదురు

సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక హైస్కూల్లో ఆదివారం మెగా మెడికల్ క్యాంపులో 960 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమాన్నిగోపాలకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేయగా, స్థానిక డాక్టర్ల బృందంచే డాక్టర్ ప్రశాంతి పతాక ఆవిష్కరణ చేశారు. ఈ శిబిరంలో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అనంతరం వారికి మందులు పంపిణీ చేశారు. శ్రీ సత్య సాయి మొబైల్ వ్యాన్ ద్వారా 350 మంది రోగులకు ఇసిజి, ఎక్సరే, రక్త పరీక్షలు చేశారు. 92 మంది కంటి రోగులకు ఉచితంగా కళ్ల జోళ్లు, 10 మందికి కంటి శుక్లముల ఆపరేషన్ నిమిత్తంవేమగిరి పంపించామని నిర్వాహ కులు తెలిపారు. అనంతరం ఉచిత భోజన ప్రసాద వితరణ చేశారు. ఈ శిబిరంలో అమలాపురం జోన్ కన్వీనర్ డాక్టర్ జి.ప్రభాకర్, స్థానిక డాక్టర్లు బి.రాఘవేంద్రరావు , డాక్టర్. కాసిన.ప్రభాకర్ , పర్వత. వర్ధనరావు, వైద్య సేవలందించారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

చెక్కు అందజేస్తున్న ముమ్మిడివరం ఎంఎల్ఎ సుబ్బరాజు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

అనారోగ్యంతో భాద పడుతున్న వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి దోహదపడుతుందని ప్రభుత్వ విప్ మరియు ముమ్మిడివరం శాసన సభ్యులు దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ నాలుగో వార్డుకు చెందిన పసుపులేటి బి.వి.వి. చైతన్య అనారోగ్యముతో ఆసుపత్రి పాలయ్యాడు. భాధితుడికి ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైనా రూ.21,960 చెక్కును ఆదివారం క్యాంప్ కార్యాలయంలో ఎంఎల్ఎ సుబ్బరాజు చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చెల్లి అశోక్, గుత్తుల సాయి, దొమ్మేటి రమణ కుమార్, గొల్లపల్లి గోపి లతో పాటు పలువురు పాల్గొన్నారు. **అల్లవరం:** మండలంలోని గోడి గ్రామం ఇందిరానగర్‌కు చెందిన గాలి రాకేష్‌కు సిఎం రిలీఫ్ ఫండ్ రూ.25 వేల చెక్కును అమలాపురం ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో తోట నరసింహారావు, గాలి నరేష్ పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న అమలాపురం ఎంఎల్ఎ ఆనందరావు

ఎంఎల్‌సి పేరాబత్తుల విజయోత్సవ ర్యాలీ

పాల్గొన్న ఎంఎల్‌సి పేరాబత్తురాజశేఖర్

ప్రజాశక్తి - ఐ.పోలవరం

ఇటీవల జరిగిన ఉమ్మడి పశ్చిమ - తూర్పు గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయం సాధించారు. ఈ సందర్భంగా మొదటి సారిగా ఆయన స్వగ్రామం అయిన జి.వేమవరానికి వస్తున్న సందర్భంగా ముందుగా పాతఇంజరం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎదుర్లంక వారధి వద్ద నుంచి ఆదివారం పలుగ్రామాల మీదుగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎదుర్లంక వారధి వద్దకు అభిమానులు, కార్యకర్తలు,స్నేహితులు, యువత పెద్ద ఎత్తున తరలి వచ్చారు, వారి సమక్షంలో పేరాబత్తుల రాజశేఖర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్, మాజీ లోకసభ స్పీకర్ జిఎంసి.బాలయోగి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేకును కట్ చేశారు. రాజశేఖర్ ఇంటికి చేరే వరకు బాణసంచా కాలుస్తూ తీన్‌మార్ డప్పులతో మారు మోగించారు. ఆయనకు దారి పొడుగునా పలువురు పుష్పగుచ్ఛాలు అందించారు. ఆయనను పూల దండలు వేసి, శాలువాతో సత్కరించి అభినందించారు. అనంతరం ఇంటికి వచ్చిన వారందరికి భోజనం ఏర్పాట్లు చేశారు. రాజశేఖర్ వెంట ముమ్మిడివరం మాజీ ఎంఎల్ఎ చెల్లి వివేకానంద, రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, పేరాబత్తుల వెంకట రామణ, బీర సత్యకుమారి, మద్దింశెట్టి పురుషోత్తం, చోడిశెట్టి బ్రహ్మానందం, సుబ్బారావు, కాగిత బాలయోగి, చిలువూరి సుబ్బరాజు, గాలిదేవర పద్మనాభం, పెంటా రవి, శివరాం కృష్ణ పాల్గొన్నారు

కార్టూ'నిజం'



రొయ్యల చెరువు అక్రమ తవ్వకంపై ఫిర్యాదు

అక్రమంగా తవ్వుతున్న రొయ్యల చెరువు

ప్రజాశక్తి - కాట్రేనికోన

మండలంలోని మొండిపోర లో తవ్వుతున్న అక్రమ రొయ్యల చెరువు పై బాధిత రైతులు తహశీల్దార్‌కు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే నెం. 481/2లో ఉన్న సుమారు మూడు ఎకరాల వరి చేనును కె.భరత్ కుమార్, గుబ్బల నాగేశ్వరరావు, కె.తరుణ్‌కుమార్‌లు దగ్గరుండి చెరువును తవ్విస్తున్నారని బాధిత రైతులు ఆరోపించారు. ఈ విషయమై విఆర్‌ఒకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తవ్వుతుండగా ఫోన్ చేసి చెప్పిన అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేశారని రైతులు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇద్దరు కానిస్టేబుల్ వచ్చి తవ్వకాన్ని అడ్డుకున్నారని వారు వెళ్ళిపోయిన తర్వాత యథావిధిగా తవ్వేశారని అన్నారు. ఈ ప్రాంతంలో రొయ్యల చెరువులు తవ్వడం మూలంగా మిగతా వరి చేలు ఉప్పు కయ్యలుగా మారతాయని రైతులు ఆందోళన చేశారు. సంసాని శ్రీనివాసు, ఎస్ఎస్ఎన్.మూర్తి, విత్తనాల రామకష్ణమూర్తి, సంసాని గంగాధరరావు తదితరులు ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు.

చెరువు తవ్వకాలు నిలుపుదల ..

కాట్రేనికోన పంచాయతీ శివారు మొండిపోరలో తవ్వుతున్న రొయ్యల చెరువు అక్రమం తవ్వకంపై బాధిత రైతులు ఫిర్యాదు మేరకు తహశీల్దార్ సునీల్ కుమార్ అదేశాలతో పనులను నిలుపుదల చేసినట్లు గ్రామ రెవిన్యూ అధికారి కళ్యాణ్ సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 481/2 సర్వే నెంబరులో ఉన్న సుమారు మూడు ఎకరాల వరి పంట చేను యజమానికి నోటీసులు జారీ చేశామన్నారు. అనుమతులు వచ్చే వరకు ఏవిధమైన పనులను చేపట్టరాదన్నారు.

పంపింగ్ స్కీమ్‌కు రక్షణ గోడ నిర్మించాలి

రక్షణ గోడ లేక ఏర్పాటుచేసిన కర్రలు,బరకం

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని తాతపూడి సమీపంలో గోదావరి ఏటి గట్టు పై ఉన్న పంపింగ్ స్కీమ్ భవనానికి రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు .గతంలో ఈ గోడ వర్షాల ఉధృతికి నేలమట్టం కావడంతో ఆ ప్రాంతంలో రక్షణ గోడ కరువయ్యింది .నీటి ఎద్దడి సమయాల్లోనే ఈ పంపింగ్ స్కీం నుండి గోదావరి నది నుంచి సాగునీరు కు వినియోగిస్తారు. అధికారులు మిగిలిన రోజుల్లో ఈ భవనం వైపు కన్నెత్తి కూడా చూడరు. రక్షణ గోడ లేని ప్రాంతంలో కర్రలతో ఏర్పాటు చేశారు. గతంలో ఈ పంపింగ్ స్కీంలో ఉన్న సామగ్రి చోరీ జరిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి .భవనంలో విలువైన మోటార్లు, సామగ్రి, ఉన్న నేపథ్యంలో ఆ ప్రాంతంలో రక్షణ గోడ నిర్మించాలని ప్రజలు, స్థానికులు, సంబంధిత అధికారులను కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఎక్సైజ్ కానిస్టేబుల్ సస్పెన్షన్

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని సుంకరపాలెంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి సంఘటనకు బాధ్యుడిగా ఎక్సైజ్ కానిస్టేబుల్ బి.ఆనంద్‌రాజును సస్పెండ్ చేసినట్లు ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ వై.చైతన్యమురళి తెలిపారు. కరప మండలం గురజనాపల్లి శివారు అడవి పూడి గ్రామానికి చెందిన కోట శ్రీరామ్(21), పిఠాపురానికి చెందిన మరొక యువకుడు యానం నుంచి వెళ్తుండగా సుంకరపాలెం చెక్ పోస్ట్ సిబ్బంది మద్యం ఉందనే అనుమానంతో వెంబడించారు. దీంతో వాహనాన్ని వేగంగా నడుపుతూ లారీని తప్పించబోయి ప్రమాదానికి గురయ్యారు. ఈ ప్రమాదంలో శ్రీరామ్ మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనపై మృతుని బంధువులు చెక్ పోస్ట్‌ను ముట్టడించి ఆందోళనకు దిగారు. దీంతో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ కేసులో ప్రాథమికంగా ఎక్సైజ్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.

ధనమ్మ అమ్మవారిని దర్శించుకున్న యాత్రికులు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

మండలంలోని కేదార్లంక శివారు వీధి వారి లంక గ్రామంలో ఉన్న ఊడల మర్రి కింద వెలసిన ధనమ్మ అమ్మవారిని యాత్రికులు ఆది వారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సుదూర ప్రాంతాల నుంచి యాత్రికులు కుటుంబ సమేతంగా తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించారు. పెద్ద వృక్షం లో వెలిసిన ఈ అమ్మవారిని తిలకించేందుకు కపిలేశ్వరపురం మండల ప్రజలు గోదావరి పడవ మార్గం ద్వారా వస్తుంటారు. అనేక ప్రాంతాలైన రాజోలు, అమలా పురం, గన్నవరం, కొత్తపేట రాజమహేంద్రవరం, కాకినాడ తదితర ప్రాంతాల నుంచి వచ్చే యాత్రికులు బోడిపాలెం వంతెన మీదుగా అమ్మ వారి దర్శనానికి వచ్చి ఇక్కడే వంటావార్పు చేసుకుంటారు. ధనమ్మ మర్రి వద్ద ఉదయం నుండి సాయం కాలం వరకు పెద్దలు యువకులు పిల్లాపాపలతో సందడి చేశారు .

విద్యాశాఖ భవనం వద్ద మరమ్మతులకు గురైన చేతి పంపు

నిరుపయోగంగా చేతి పంపు

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

స్థానికమండల పరిషత్ కార్యాలయం విద్యాశాఖ భవనం వద్ద ఉన్న చేతి పంపు మరమ్మతులకు గురయ్యి సంవత్సరాలు గడుస్తున్న అధికారులు నేటికీ చేతిపంపును పట్టించుకోలేదు. ఇటీవల కాలంలో భవనం సమీపంలోని మరుగుదొడ్లు నిర్మించడంతో చేతిపంపు వద్ద ఉన్న మోటారును తీసుకువెళ్లి వాటర్ ట్యాంక్ వినియోగించి, కుళాయి సౌకర్యం కల్పించడంతో ఈ చేతి పంపును పట్టించుకోలేని నాథుడే కరువయ్యారు. విద్యాశాఖ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేటప్పుడు, సామూహిక భోజనం కార్యక్రమాలు ఏర్పాటు చేసినప్పుడు తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్న సందర్భాలు ఏర్పడుతున్నాయి. మరుగుదొడ్డి వద్ద ఉన్న కుళాయిలను వినియోగించడానికి ఇష్టపడని వారు ఈ చేతి పంపునే వినియోగించేవారు. ఈ చేతి పంపు కూడా పనిచేయకపోవడంతో తాగడానికి నీళ్ల లేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులకు గురైన చేతి పంపును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

చేనేతలను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

రాష్ట్ర ప్రభుత్వం చేనేతలను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఊటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కోరారు. స్థానిక ముప్పన రామారావు వీవర్స్ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా చేనేత సంక్షోభం వల్ల చేనేత పరిశ్రమ రోజురోజుకు శిథిలమవుతుందన్నారు. దీంతో చేనేత కార్మికులకు ఉపాధి లేక అల్లాడుతున్నారన్నారు. చేనేత పరిశ్రమ రక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీ సమావేశాలలో చేనేతల సమస్యలు, వారి కష్టాల గురించి ప్రభుత్వానికి తెలియజేసిన ఎంఎల్ఎలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నడికుడి ఈశ్వరరావు, అయితాబత్తుల ఆనందరావు, కందికుంట ప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో అమరావతి రాజధానిలో ప్రభుత్వ సహకారంతో దేవాంగ భవనం నిర్మించాలని, దేవాంగులను ఆర్థికంగా ఆదుకోవాలని తీర్మానించారు. ఈ సమావేశంలో సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వరరావు, నాయకులు బండారు ఆనందప్రసాద్, ముప్పన వీర్రాజుతదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

ప్రజాశక్తి - కిర్లంపూడి

ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను అందించాలని వైసిపి నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం అన్నారు. కిర్లంపూడిలో డాక్టర్ బి.చంద్రకిరణ్‌బాబు, డాక్టర్ జ్యోతిర్మయి నిర్మించిన నూతన ఆదర్శ ఆసుపత్రిని వైసిపి నియోజకవర్గ కో-ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దంపతులు, ప్రముఖ వైద్యులు డాక్టర్ జవహర్ దంపతులు, డాక్టర్ విజయ్ కుమార్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు

జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

10వ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు తెలిపారు. మార్చి 17వ తేదీ నుంచి 1వ తేదీ వరకూ 10వ తరగతి పరీక్షలు జరగనున్నాయి. ఈ సందర్భంగా 'ప్రజాశక్తి' జిల్లా విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావును పలకరించింది. పకడ్బందీగా, పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేస్తున్నామన్నారు. ఆయన వెల్లడించిన వివరాలు మాటల్లోనే...

జిల్లా వ్యాప్తంగా 25,723 మంది విద్యార్థులు

మార్చి 17 నుంచి నిర్వహించే 10వ తరగతి పరీక్షలకు సంబంధించి మొత్తం 25,723 మంది విద్యార్థులు హాజరుకానున్నారని, వీరిలో రెగ్యులర్, ప్రయివేట్ విద్యార్థినీ, విద్యార్థులు 24,763 మంది కాగా ఒఎస్ఎస్‌సి ప్రయివేట్ విద్యార్థినీ, విద్యార్థులు 960 మంది ఉన్నారు. విద్యార్థి భవిష్యత్తుకు 10వ తరగతి తొలి మెట్టు. ఈ తరుణంలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణను అందించాము. స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేసి పరీక్షలకు సన్నద్ధం చేశాము. పిల్లలు స్వేచ్ఛాయుత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాము.

134 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో 134 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రతి రోజు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగునున్నాయి. విద్యార్థులను 8.45కు కేంద్రాల్లోకి అనుమతిస్తాము. ఆలస్యంగా వచ్చిన వారిని కేంద్రంలోకి అనుమతించేది లేదు. పరీక్షా కేంద్రాలను ముందుగానే ఒకసారి తనిఖీ చేసి లోటుపాట్లు ఉంటే ముందుగానే చక్కదిద్దనున్నాము. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒఆర్ఎస్ ప్యాకెట్లు, బిపి, షుగర్ చెక్ చేసే పరికరాలు, అత్యవసర మందులతో వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఒకరు అందుబాటులో ఉంటారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు

జిల్లాలో 6 సమస్యాత్మక కేంద్రాలను గుర్తించాము. ఆయా కేంద్రాల వద్ద ప్రత్యేకమైన నిఘా ఏర్పాట్లు చేపట్టనున్నాము. మాస్ కాపీయింగ్‌ను

నిరోధించేందుకు 5 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయనున్నాము. స్క్వాడ్స్ ప్రతిరోజూ ఆయా కేంద్రాలను తనిఖీ చేస్తాయి. అలాగే సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నాము. పరీక్షల విధుల్లో ఉన్నవారు మినహా బయటి వ్యక్తులను కేంద్రాల్లోకి అనుమతించరు. దివ్యాంగులకు అవసరమైతే స్క్రయిబ్‌ను ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించాము. డిఒలు, ఎడిఒలు, ఇన్విజిలేటర్స్, స్క్వాడ్స్, సి- కార్ కస్టోడియన్స్ మొత్తం 1100 మందిని నియమించాము.

పక్కా ప్రణాళికతో విద్యార్థులను సిద్ధం చేశాం

విద్యార్థులను ప్రణాళికా బద్ధంగా సిద్ధం చేశాము. తొలుత విద్యార్థులలో అభ్యసనా సామర్థ్యాన్ని గుర్తించి ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నాం. అదే విధంగా ప్రతి రోజూ పరీక్షల నిర్వహణ ద్వారా విద్యార్థులలో పరీక్షల పట్ల భయం దూరం చేశాము. విద్యార్థులు ఎటువంటి ఆందోళనకు గురికావొద్దు. ఈ పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధిస్తారని ఆకాంక్షిస్తున్నాము.

కబడ్డీ పోటీలకు జిల్లా జట్ల ఎంపిక

ప్రజాశక్తి - సామర్లకోట

ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు కడప జిల్లా పులివెందులలో నిర్వహించనున్న 34వ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి బాలుర, బాలికల కబడ్డీ జట్లు ఎంపిక జరిగింది. ఆదివారం స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలుర జట్లులో 12 మందిని, బాలికల జట్టులో 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన వీరిని రాష్ట్రస్థాయి పోటీలకు సిద్ధం చేస్తున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కొండపల్లి శ్రీనివాస్ చెప్పారు. ఈ ఎంపిక కార్యక్రమంలో ప్రో కబడ్డీ తెలుగు రాష్ట్రాల రెఫరీ భోగిళ్ళ మురళీకుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు బడుగు శ్రీకాంత్, కోశాధికారి నిమ్మకాయల కిరణ్‌కుమార్, పాఠశాల హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ, రిటైర్ వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం, వ్యాయామ ఉపాధ్యాయులు పోలరాజు, టిడిపి పట్టణ అధ్యక్షులు అడబాల కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

బాలురు, బాలికల జట్టులో సభ్యులు వీరే

బాలుర జట్లులో జి.త్రిమూ ర్తులు, జి.నరేష్, సిహెచ్ఎంకె.రెడ్డి, కె.అభిరామ్, కె.ప్రవీణ్‌కుమార్, బి. అజయ్, సిహెచ్‌పివిఎస్.శ్రీహర్ష, వి.సూర్యచరణ్, బి.మనోజ్, వై.సా మ్రాట్, జి.వీరబాబు, ఎం.దుర్గాప్రసాద్ రావు ఎంపికయ్యారు. అలాగే బాలికల జట్టులో ఎంవి.దుర్గామహాలక్ష్మి, ఎస్.భవాని, టి.మహేశ్వరి, బిహెచ్. వరలక్ష్మి, ఎజి.భవాని, సిహెచ్‌వి ఆర్‌పి.దుర్గభవాని, బి.దివ్యశ్రీ, ఎ.భార్గవి, సిహెచ్ ఎల్.ప్రత్యూష,ఎంఎల్‌వి.దుర్గ, జి.శిరీష, వర్షిత ఎంపికయ్యారు.

ఆటో యూనియన్ అధ్యక్షునిగా కాసులు

ప్రజాశక్తి - సామర్లకోట

పట్టణ ఆటో యూనియన్ నూతన కమిటీ అధ్యక్షులుగా మామిడాల కాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ చిన్ని ఆధ్వర్యంలో ఆటో యూనియన్ అధ్యక్షుడుగా కాసులు, లీగల్ అడ్వైజర్‌గా న్యాయవాది చిక్కం ఈశ్వరుడు ఎన్నికయ్యారు.

సమావేశంలో మాట్లాడుతున్న వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘ సమావేశం

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

ఎపి రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ సమావేశం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కాకినాడ జిల్లా పెద్దాపురంలో ముప్పన రామారావు చేనేత సహకార భవనంలో ఈ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొని జాతి ఔన్నత్యానికి, సంక్షేమానికి తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించారు. తమ పదవీ కాలంలో అమరావతి లో దేవాంగ భవన్ నిర్మాణానికి సంఘీయుల, ప్రభుత్వ సహకారంతో కషి చేస్తానని వూటుకూరి అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మాడిశెట్టి శివ శంకరయ్య, కోశాధికారి కొండపల్లి పరమేశ్వర రావు, మత్స్యా నిరంజన్, బళ్ల వెంకట రమణ, బండారు ఆనంద ప్రసాద్, పులి రామచంద్రయ్య, పిచ్చిక శ్యామ్, ఎస్‌వి.రమణారావు, బూసం వీరభద్రయ్య, ముప్పన వీర్రాజు, చింతా వీరభద్రేశ్వర రావు, బళ్ల వేంకటేశ్వర రావు, జాన బాబ్జీ, మాడా రాము,యర్రా వీరభద్రరావు, ఎక్కల ఆంజనేయ ప్రసాద్,ఉప్పు సత్యనారాయణ తదితర రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరలో పాల్గొన్న వైసిపి నాయకులు

యువత పోరు బాట పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - అమలాపురం

వైసిపి రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఈ నెల 12న నిర్వహించనున్న యువత పోరు బాట నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను పార్టీ జిల్లా పార్టీ అధ్యక్షుడు పినిపే విశ్వరూప్ నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు.ఈ సమావేశంలో ఎంఎల్‌సి లు కుడిపూడి సూర్యనారాయణ రావు, బొమ్మి ఇజ్రాయిల్, రామచంద్రపురం నియోజవర్గ కో-ఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్, పి.గనవరం కో-ఆర్డినేటర్టర్ గన్నవరపు శ్రీనివాసరావు, నేతలు రెడ్డి సత్యనాగేంద్ర మణి, కుడుపూడి భాగ్యలక్ష్మి, చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఉండ్రు వెంకటేష్, ఒంటెద్దు వెంకన్న నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు సైన్స్ సంబరాల ముగింపు వేడుకలు

ప్రజాశక్తి - ముమ్మిడివరం

విద్యార్థులలో దాగి ఉన్న శాస్త్రీయ దక్పథాన్ని వెలికి తీసెందుకు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి సైన్స్ సంబరాలు ముగింపు వేడుకలు సోమవారం ముమ్మిడివరం జడ్‌పి బాలుర పాఠశాలలో ఘనంగా నిర్వహించెందుకు ఏర్పాటు చేసినట్లు జిల్లా సైన్స్ అధికారి జివిఎస్.సుబ్రహ్మణ్యం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖధికారి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 28 నుంచి జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో విజ్ఞాన శాస్త్ర సైన్స్ వేడుకలు నిర్వహిస్తున్నామని అన్నారు. ముగింపు వేడుకలు ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని స్థానిక జడ్‌పి బాలుర పాఠశాలలో నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి ముగింపు వేడుకలు ప్రారంభ మవుతాయని అన్నారు. ఈ వేడుకల్లో భాగంగా జిల్లా స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించడంతో పాటు ప్రాథమిక స్థాయిలోనూ, మండల స్థాయిలోనూ విజేతలుగా నిలిచిన చిన్నారులలో సృజనాత్మకతను పెంపా ందించే విధంగా పరిశోధన దక్పథం, ఆవిష్కరణలపై ఆసక్తిని పెంపొందించే విధంగా ప్రత్యేక డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలకు వారికీ ప్రత్యేక బహుమతులను జిల్లా విద్యాశాఖధికారి చేతులు మీదుగా అందజేస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జనసేన ఆవిర్భావ సభ విజయవంతానికి పిలుపు

ప్రజాశక్తి - రాజోలు

మాట్లాడుతున్న ఎంఎల్ఎ దేవ వరప్రసాద్

కాకినాడ జిల్లాలోని పిఠాపురం - చిత్రాడలో ఈ నెల 14న జనసేన పార్టీ 12వ ఆవిర్భావ సభ ను విజయవంతం చేయాలని రాజోలు ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఆదివారం రాజోలు మండల పార్టీ అధ్యక్షుడు సూరిశెట్టి శ్రీను అధ్యక్షతన మండలంలో ఉన్న 16 గ్రామాల జనసేన నాయకులు, కార్యకర్తలతో రాజోలు అంబేద్కర్ సామాజిక భవనంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎంఎల్ఎ దేవ వరప్రసాద్, జనసేన ఆవిర్భావ సభ రాజోలు నియోజకవర్గ పరిశీలకులు, రాష్ట్ర మాల కార్పొరేషన్ ఛైర్మన్ పెదపూడి విజయ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎంఎల్ఎ దేవ వరప్రసాద్ మాట్లాడుతూ గ్రామాల నుంచి కార్యకర్తలు తరలిరావాలన్నారు. ఈ సందర్భంగా బస్సు సదుపాయం, భోజన ఏర్పాట్లు చేశామని తెలియచేశారు. సమావేశంలో రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్ గుండు బోగుల పెద్దకాపు, రాజోలు డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ పినిశెట్టి బుజ్జి, గుండాబత్తుల తాతాజీ, రాజోలు వైస్ ఎంపిపి ఇంటిపల్లి ఆనందరాజు, కాట్న రాజు, అడబాల రాంబాబు, గిడుగు శేఖర్, కోళ్ల బాబి, విప్పర్తి సాయిబాబు, బొమ్మిడి మహేష్ తదితరులు పాల్గొన్నారు. **కాట్రేనికోన:** జనసేన పార్టీ ఆవిర్భావ సభకు గ్రామాల నుండి వేలాదిగా కార్యకర్తలు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు పిలుపునిచ్చారు. పార్టీ ఆదేశాల మేరకు ఆయన ఆదివారం మండల పరిధిలోని మత్స్యకార గ్రామాలైన పల్లం, నీళ్లరేవు, వేట్లపాలెం, గచ్చకాయలపొర, బలుసు తిప్ప గ్రామాలలో పర్యటించి నాయకులను సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట జనసేన పార్టీ మండల అధ్యక్షులు మోకా బాల ప్రసాద్, అంగని నరసింహమూర్తి, బాలకృష్ణ, రమేష్ ఉన్నారు.

కోనసీమలో ఆర్ట్ గ్యాలరీ ప్రారంభం

ప్రజాశక్తి - కాట్రేనికోన

క్రియేటివ్ ఆర్ట్ అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు, ప్రముఖ చిత్రకారులు అంజి ఆకొండి ఆధ్వర్యంలో కాట్రేనికోనలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీని అమలాపురం డిఎస్‌పి టిఎస్ఆర్‌కె.ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. గత పది సంవత్సరాలుగా చిత్రకళలో ఎనలేని కృషి చేస్తూ రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులను, పురస్కారాలను అందుకుని జాతీయస్థాయిలో కొన్ని వందలమంది విద్యార్థులకు చిత్రకళలో శిక్షణ ఇస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే కాకుండా హైదరాబాద్ సాలార్‌జంగ్ మ్యూజియం, జెఎన్‌టియు ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ లో కూడా క్రియేటివ్ హార్ట్స్ సంస్థ ద్వారా వందల సంఖ్యలో చిత్రకారులతో చిత్రకళ ప్రదర్శనలు చేయడం జరిగింది. అదే స్ఫూర్తితో గ్రామంలో సైతం చిత్రకళ మీద అందరికీ ప్రోత్సాహం అందించాలని చిత్రకళ మీద ఆసక్తి ఉన్న ప్రతీ ఒక్కరికి ప్రదర్శన చేసే అవకాశం లభించాలని సదుద్దేశ్యంతో ఈ ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేస్తునట్లు అంజి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులకు గౌరవ సత్కారాలను అందించారు. ఈ సందర్భంగా పాలకొల్లుకు చెందిన చిత్రకారులు మార్లపూడి ఉదయ్ కుమార్ని చిత్రకళా తపస్వి అనే బిరుదుతో సత్కరించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన 60 మంది చిత్రకారులకు బహుమతులు అందజేశారు.

నూకాంబిక అమ్మవారికి పావు కిలో వెండి అందజేత

ప్రజాశక్తి - ఆలమూరు

ఆలయంలో దాతలతో గ్రామస్తులు

చింతలూరు శ్రీ నూకాంబికా ఆలయం లో అమ్మవారికి వెండి ఆభరణాలను రూపొంది స్తున్నారు. ఈ సందర్భంగా ఆలమూరుకు చెందిన చిరుకూరి శ్రీలక్ష్మీ సౌమ్య, వీరప్రసాద్ దంపతులు ఆదివారం పావుకేజీ వెండిని ఇఒ వీర్రాజు చౌదరికి అందజేశారు. అమ్మవారి వెండి ఆభరణాల తయారీలో ఈ వెండి వినియోగించనున్నట్లు ఇఒ తెలియజేశారు. కార్యక్రమంలో చిరుకూరి సత్తిబాబు, వెంకటలక్ష్మి, భార్గవ శ్రీధర్, యాత్రికులు పాల్గొన్నారు.

ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ సత్యానందరావు

మారెమ్మ ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొత్తపేట

మండలం వాడపాలెం గ్రామ దేవత మారెమ్మ అమ్మవారి జాతర మహోత్సవాల పోస్టర్ ఎంఎల్ఎ బం డారు సత్యానందరావు తన కార్యాలయం వద్ద ఆదివారం ఆవిష్కరించారు. మార్చ్ 16, 17,18 తేదీలలో జరిగే ఉత్సవాల్లో అందరూ పాల్గొనాలని సత్యానందరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో బండారు బుల్లితాత, బండారు ధనరాజు, బండారు వీరబాబు, చిక్కట్ల అబ్బు, బండారు రాజేష్, బండారు శివరామకృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

స్థల వివాదంలో గాయాలైన మాలతికి పరామర్శ

ప్రజాశక్తి - అమలాపురం రూరల్

పరామర్శిస్తున్న ఎంఎల్‌సి ఇజ్రాయిల్

ముమ్మిడివరం మండలం అనాతవరానికి చెందిన చేట్ల మాలతిని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ ఆదివారం అమలాపురం కిమ్స్ హాస్పటల్ నందు పరామర్శించారు. ఇటీవల స్థల వివాదంలో పంతగంటి జయరామకృష్ణ చేట్ల మాలతి పై కత్తితో దాడి చేసి తీవ్ర గాయాల పాలు చేసిన విషయం తెలిసిందే. ఆమె ప్రస్తుతం కిమ్స్ హాస్పిటల్ చికిత్స పొందుతోంది. ఇజ్రాయిల్ బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బాధితురాలిని తీవ్ర గాయాల పాలు చేసిన పంతగంటి జయరామకృష్ణపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా అమలాపురం డిఎస్‌పికి సూచించారు.

కర్ర సాము పోటీలో అబ్బులు ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

ప్రశంసాపత్రంతో విజేత అబ్బులు

గుంటూరు జిల్లా పోతూర్ ఎపిఎంఇ స్కూల్ నందు భారత రక్ష మంచ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కర్రసాము పోటీలు నిర్వహిం చారు. ఈ పోటీల్లో సీనియర్స్ విభాగంలో మండలంలోని కలవచర్లకు చెందిన తాతపూడి అబ్బులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానం సాధించారు. దీంతో అబ్బులను స్టేట్ ప్రెసిడెంట్ సి.ఆదినారాయణ, సెక్రటరీ డి.అశోక్ బాబు, ఆర్గనైజర్ డీ.ఎస్.సి. క్రిష్టఫర్ తదితరులు అభినందించి, ప్రత్యేక ప్రశంస పత్రాన్ని, షీల్డ్ ను అందజేశారు.

పెయింటర్స్ యూనియన్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - ముమ్మిడివరం

మండలంలో కొత్తలంక శ్రీ వల్లి బాబా దర్గా ఆవరణలలో శ్రీ వీరేశ్వర పెయింటర్ యూనియన్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ప్రెసిడెంట్ కాండ్రేగుల రమణ, వైస్ ప్రెసిడెంట్ దుగ్గుదుర్తి వెంకటేష్, సెక్రటరీ రామకృష్ణ, జాయింట్ సెక్రెటరీ దుర్గారావు, సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీ మెంబర్లు దివి సూర్యనారాయణ, రుద్రాక్షల లోవరాజు, దైవల నాగరాజు, కముజు రామారావు,

ఎన్నికైన నూతన కార్యవర్గం

విత్తనాలు శ్రీనివాస్రావు, సంసాని పుల్లయ్య, ఇమ్మంది రవికుమార్.. తదితరులు పాల్గొన్నారు.. నూతన కార్యవర్గానికి పలువురు అభినందనలు తెలియజేశారు. యూనియన్ సభ్యులకు ఎవరికి కష్టం వచ్చినా యూనియన్ తరపున ఆర్థిక సాయం అందజేస్తామని వారు తెలిపారు.

నేడు యథావిధిగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం ఈనెల 10న సోమవారం ఉదయం 10 గంటల నుంచి యథావిధిగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టరేట్లోని గోదావరి భవన్ లో జరుగునని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి మీ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకునేలా తమ తమ సమస్యలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చి తగు పరిష్కార మార్గాలు పొందాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాస్థాయితో పాటు డివిజన్, మండలం, మున్సిపల్ స్థాయిలో కూడా మీకోసం కార్యక్రమం జరుగునని కలెక్టర్ పేర్కొన్నారు. డివిజన్ స్థాయి మీకోసం కార్యక్రమం జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజనల్ అధికారుల కార్యాలయాలలో నిర్వహిస్తారన్నారు. డివిజనల్ స్థాయి అధికారులు అందరూ సంబంధిత రెవిన్యూ డివిజనల్ అధికారికార్యాలయాలలో పాల్గొంటారని అన్నారు. మండల స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమం సంబంధిత మండల పరిషత్ అభివృద్ధి అధికారుల కార్యాలయాల్లో నిర్వహిస్తారని ఈ కార్యక్రమంలో సంబంధిత మండల తహశీల్దార్లు, మండల అభివృద్ధి అధికారుల తో పాటు మండల స్థాయి అధికారులంతా తప్పని సరిగా మీకోసం కార్యక్రమంలో పాల్గొనాలన్నారు.

ఎక్సైజ్ అధికారికి వినతిపత్రం అందజేత

ఆలయాల పక్కన మద్యం షాపులు తొలగించాలని వినతి

ప్రజాశక్తి - కొత్తపేట

స్కూల్ బస్టాండ్, దేవాలయాలు పక్కన మద్యం షాపులను వెంటనే తొలగించాలని పాలూరి సత్యానందం, కనకేశ్వరరావు ఎక్సైజ్ అధికారులకు విన్నవించారు. ఈ సందర్భంగా ఆదివారం కొత్తపేట ఎక్సైజ్ సిఐ కె.కాత్యాయనికి వినతిపత్రం సమర్పించారు. బొడిపాలెం వంతెన వద్ద దుర్గమ్మ తల్లి గుడి, ఆంజనేయ స్వామి గుడి అయ్యప్ప స్వామి గుడి, వారాహి మాత గుడి ఉన్నాయన్నారు. రోజూ అధిక సంఖ్యలో మహిళలు గుడికి వెళ్లి పూజలు నిర్వహిస్తూ ఉంటారన్నారను. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం లో ప్రభుత్వం మద్యం షాపు కేటాయించడం ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. ఎక్సైజ్ అధికారులు తక్షణమే మద్యం షాపును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాయామంతో ఆరోగ్యవంతమైన జీవితం

ప్రజాశక్తి - కాకినాడ రూరల్

ప్రతిరోజు సమతుల్యమైన ఆహారాన్ని తీసుకుంటూ వ్యాయామం చేయడంతో ఆరోగ్యదవంతమైన జీవించవచ్చునని వ్యవసాయ శాఖ విశ్రాంతి డైరెక్టర్ పాలడుగు సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం బోట్ క్లబ్ ఉద్యానవనంలో వాకర్స్ సంఘానికి ఆయన కుర్చీలు బహుకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవన సరళి, వ్యాయామ ప్రక్రియలు ఒకదానితో మరొకటి కలిసి ఉంటాయన్నారు. వ్యాయామ ప్రక్రియలు శరీరాన్ని, మనసును, మెదడును సమతుల్యం చేస్తాయన్నారు. వయసుతో తారతమ్యత లేకుండా ప్రతి ఒక్కరు వ్యాయామం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు అడబాల రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న కమల

కమలకు నారీరత్న పురస్కారం అందజేత

ప్రజాశక్తి - ముమ్మిడివరం

రాష్ట్ర అంగన్‌వాడీ, డ్వాక్రా సాధికార కార్యదర్శి, మదర్ థెరిసా ఉమెన్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు మెండి కమల నారీరత్న పురస్కారం అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం శ్రీశ్రీ కళావేదిక సిఇఒ కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన విజయవాడ గాంధీనగర్‌లో జరిగిన అవార్డుల ప్రదానోత్సవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థల జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి చేతులు మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వివిధ రంగాలలో కమల చేస్తున్న సేవలను గుర్తించి అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అవార్డుకు ఎంపిక చేసిన డాక్టర్ ప్రతాప్, జాతీయ మహిళా అధ్యక్షురాలు రామావతికి కృతజ్ఞతలు తెలిపారు.

దస్తావేజులు పడిపోయినవి

కాట్రేనికోన మండల పరిధిలోని పల్లంకుర్రు కాపరస్తులు కసిరెడ్డి సత్యనారాయణమ్మ w/o (లేటు) సత్యనారాయణ మూర్తి అనువారికి సంబంధించిన దస్తావేజు నెంబరు **1764/1967** గల ఒరిజినల్ దస్తావేజు బ్యాగ్ లో పెట్టుకుని 5/3/25 తేదీన కాట్రేనికోన వస్తుండగా మార్గమధ్యంలో పడిపోయినవి. దొరికిన వారు ఈ కింద అడ్రస్ కు అందజేయగలరు

కసిరెడ్డి సత్యనారాయణమ్మ
పల్లంకుర్రు,కాట్రేనికోన మండలం,
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా,
ఫోన్ నెంబర్:9491684780

పాస్ పోర్టు పడిపోయినది

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామ రావిచెట్టు వీధి కాపురస్తులు లంక భద్రరావు గారి కుమార్డు లంక వీర మణికంఠ డోర్ నెం 2-58 యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా యొక్క పాస్ పోర్టు నెంబర్ **Y7698237,** తేదీ 19-09-2023 కలది. 25-02-2025 వ తేదీన మా ఇంటి నుండి రంగంపేట సెంటర్లో గల జిరాక్స్ షాపు నకు వెళ్లు చుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్ పోర్టు పడి పోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావునా ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియ జేయ గలరు.

లంక వీర మణికంఠ
S/o భద్రరావు డోర్ నెం.. 2-58,రావిచెట్టు వీధి..
ఈలకొలను రంగంపేట మండలం.. తూర్పుగోదావరి జిల్లా
సెల్ నెంబరు.9381935592

పాస్ పోర్టు పడి పోయినది

తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం ఈలకొలను గ్రామ వాటర్ ట్యాంక్ వీధి కాపురస్తులు దేవలంక శ్రీరాములు గారి కుమార్డు దేవలంక అయ్యప్ప డోర్ నెం 2-51 యావన్మందికి తెలియ జేయునది ఏమనగా నా యొక్క పాస్ పోర్టు నెంబర్ **S 3918499** తేదీ 9-11-2018 కలది. 20- 02- 2025 వ తేదీన మా ఇంటి నుండి దొంతమూరు లో గల జిరాక్స్ షాపు నకు వెళ్లు చుండగా మార్గ మధ్యలో నా ఒరిజినల్ పాస్ పోర్టు పడి పోయినది. ఎంత వెతికినను దొరకలేదు. కావునా ఎవరికైనా దొరికినచో ఈ క్రింది అడ్రస్ కు తెలియ జేయ గలరు.

దేవలంక అయ్యప్ప
S/o శ్రీరాములు, డోర్ నెం.. 2-51, వాటర్ ట్యాంక్ వీధి ..
ఈలకొలను ,రంగంపేట మండలం.. తూర్పుగోదావరి
జిల్లా.సెల్.. 9948313486.